E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 01-01-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక: 02|| పేజీలు–6 www.ekaburu.com



న్యూఇయర్ స్పెషల్..
ప్రభాస్ 'స్పిరిట్' ఫస్ట్ లుక్ వచ్చేసింది..
» 5లో

## కొత్త సంవత్సరం వేళ కుమ్మేసిన మందుబాబులు



» ఏపీ తెలంగాణలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
» తెలంగాణలో బుధవారం ఒక్కరోజు రూ.171.93 కోట్లు మద్యం అమ్మకాలు
» నెల రోజుల సమయంలో ప్రభుత్వ ఖజానాకు లిక్కర్ ఆదాయం భారీగా జమ
» కొత్త సంవత్సరం లో మద్యం అమ్మకాలపై వెసులుబాటు
» అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం అమ్మకాలు
» నూతన సంవత్సరం వేళ మందుబాబులు వీరంగం

తరువాయి 2లో

## ఏపీలో "పీఎం శ్రీ"క్రింద నాణ్యమైన విద్య




» కొత్త సంవత్సరంలో మోడీ ప్రకటన
» ఏపీలో "పీఎం శ్రీ" పథకం కింద 935 స్కూళ్ళ ఎంపిక
» స్కూళ్ళ అభివృద్ధితోపాటు విప్లవాత్మకమైన మార్పులు

ఈ కబురు,
ఏపీలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రధాని మోడీ కొత్త సంవత్సరం ప్రారంభవేళ శుభవార్త చెప్పారు. ముఖ్యంగా అరకొర వసతులతో ఉన్న స్కూళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు ఈ కొత్త ఏడాదిలో సకల వసతులు కల్పించడమే కాకుండా జాతీయ విద్యావిధానం ప్రకారం నాణ్యమైన విద్య అందించేలా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఓ కీలక పథకంలో వీరిని భాగస్వాములు చేయబోతున్నారు. ఈ మేరకు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో జరిగిన భేటీలో మోడీ ప్రకటన చేశారు.

తరువాయి 2లో

## జల వివాదం ద్వారా లబ్ధి పొందాలని కేసీఆర్ ప్రయత్నం

» కృష్ణా, గోదావరి జలాలను సక్రమంగా వాడుకుంటే ఎంతో అభివృద్ధి
» గత పాలకుల పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నాం
» పాలమూరురంగారెడ్డి డీపీఆర్ ఏడేళ్ల వరకు సమర్పించలేదు
» కృష్ణా జలాల్లో తెలంగాణకు 71శాతం రావాల్సిందే
» బీఆర్ఎస్ మనుగడ కష్టమని కేసీఆర్ గుర్తించారు
» కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని అపోహలు సృష్టించేందుకు బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నం చేస్తున్నారు; సిఎం రేవంత్ రెడ్డి



**ఈ కబురు, హైదరాబాద్:**
తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం సృష్టించి.. తద్వారా లబ్ధి పొందాలని భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నీటి వాటాలపై చర్చ దృష్ట్యా ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం 'నీళ్లునిజాలు' అంశంపై ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. ''ప్రధానంగా నీళ్ల హక్కుల కోసమే తెలంగాణ ఉద్యమం జరిగింది. కృష్ణా, గోదావరి జలాలను సక్రమంగా వాడుకుంటే ఎంతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచి ఉండేది. నీళ్ల కోసం ఉమ్మడి రాష్ట్రంలో పీజేఆర్ స్వంత ప్రభుత్వాన్ని నిలదీశారు. గతంలో నీళ్ల విషయంలో ఎన్నో పొరపాట్లు జరిగాయి. ఆ పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నాం.

తరువాయి 2లో

## ఏటీఎఫ్ ధర తగ్గింది.. ఎల్పీజీ ధర పెరిగింది!

» 4లో




## రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు

» నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



» 2 లో

## ప్రధాని పేరిట మెయిల్స్.. రంగంలోకి సీబీఐ

**ఈ కబురు నెట్‌వర్క్:**
తనకు ప్రధాని మోదీ ఆశీస్సులు ఉన్నా-యని, స్వదేశీ యుద్ధవిమానం ఇంజిన్‌ను రూపొందించాలనుకుంటున్నట్లు రక్షణా-రంగ సంస్థలు, అధికారులకు ఇమెయిల్స్ పంపిన ఓ వ్యక్తిపై సీబీఐ కేసు నమోదు చేసింది. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..

» 2లో




## ఒక్క సినిమానే చేస్తా! ఇప్పటికే చాలా నేర్చుకున్నా..

» 5లో



## ఆర్థిక వ్యవస్థలో భారత్.. జర్మనీని అధిగమించాలంటే?

» 4లో



## మస్క్ ఉదారత.. రూ 900 కోట్ల విలువైన షేర్ల విరాళం!






## డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.1.74 లక్షల కోట్లు

దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్లు స్వల్ప వృద్ధి నమోదైంది. 2025 డిసెంబర్ నెలలో స్థూలంగా రూ.1.74 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 6.1 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. జీఎస్టీ రేట్ల కోత కారణంగా దేశీయ విక్రయాల నుంచి వచ్చే వసూళ్లు నెమ్మదించినట్లు కేంద్రం వెల్లడించింది.

» 4లో

## ఎక్కువ మోతాదులో 'ఆస్ప్రిన్' తీసుకుంటున్నా ట్రంప్



**ఈ కబురు, నెట్‌వర్క్ :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఆరోగ్యం గురించి కీలక విషయాన్ని వెల్లడించారు. వైద్యులు సూచించిన దానికంటే ఎక్కువ మోతాదులో ఆస్ప్రిన్ తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను అక్టోబర్ నెలలో సీటీ స్కాన్ (CT Scan) చేయించుకున్నానని, ఎంఆర్ఐ స్కాన్ కాదని స్పష్టతనిచ్చారు.

తరువాయి 3లో

## ప్రజల గుండెల్లో కేసీఆర్ శాశ్వతం: కేటీఆర్



» 2లో



## అర్జున్ దేశ యువతకు స్ఫూర్తి

భారత చెస్ ఆటగాడిపై ప్రధాని మోదీ ప్రశంసలు

» 2లో

ఈ-కబురు

02- 01 -2026
శుక్రవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# జల వివాదం ద్వారా లబ్ధి పొందాలని కేసీఆర్ ప్రయత్నం



ఉమ్మడి ఏపీకి కృష్ణా జలాల్లో 811 టీఎంసీలు కేటాయించారు. రాష్ట్రం విడిపోయినప్పుడు కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు అని చెప్పారు. తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అంగీకరిస్తూ పదేళ్ల కాలానికి కేసీఆర్ సంతకం చేశారు. కేసీఆర్ పెట్టిన సంతకం ఏపీకి అడ్వాంటేజ్‌గా మారింది. అప్పుడు ఏపీకి 66శాతం, తెలంగాణకు 34 శాతం జలాలకు ఆయన అంగీకరించారు. తదుపరి బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పు రాకుండా వాయిదా వేయిస్తున్నారు. నదీపరివాహకం ప్రకారం చూస్తే.. కృష్ణా జలాల్లో తెలంగాణకు 71శాతం రావాలి. నదీ పరివాహకం ప్రకారం జలాలు కావాలని వాదించాల్సి ఉండగా.. కేసీఆర్ అలా అడగలేదు. కృష్ణాలో 299 టీఎంసీలకు కేసీఆర్ అంగీకరించారని ఇవాళ కేఆర్ఎంబీ అంటోంది.

**——బీఆర్ఎస్ మనుగడ కష్టమని కేసీఆర్ గుర్తించారు..**

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పరాజయం పాలైంది. ఎన్నికల్లో వరుస ఓటములతో భారత రాష్ట్ర సమితి మనుగడ కష్టమవుతోందని కేసీఆర్ గుర్తించారు. మళ్లీ జలవివాదం రేపి, ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాల సృష్టించి తన పార్టీని బ్రతికించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. దాంట్లో భాగంగా ఒక అబద్ధాల సంఘాన్ని ఏర్పాటుచేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పార్టీని బతికించుకునేందుకు మళ్లీ నీళ్ల సెంటిమెంట్‌ను వాడుకుంటున్నారు. చంద్రబాబు పేరు చెప్పి తెలంగాణలో మళ్లీ పార్టీని బతికించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు'' అని సీఎం విమర్శించారు.

**——పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్ ఏడేళ్ల వరకు సమర్పించలేదు..**

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ ఏడేళ్ల వరకు డీపీఆర్ సమర్పించలేదు. డీపీఆర్ రూపొందించకుండానే రూ.27వేల కోట్లు ఖర్చు చేశారు. డీపీఆర్ రూపొందించలేదు కాబట్టి.. పర్యావరణ అనుమతులు కూడా రాలేదు. అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేశారు. సుప్రీంకోర్టులో కేసులు వేయడంతో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు సాగునీటి ప్రాజెక్టు కాదని అఫిడవిట్ వేశారు. తాగునీటి కోసం 7.15 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కోర్టుకు చెప్పారు. కమీషన్ల కోసం పంపులు, లిఫ్టుల కంపెనీలకు రూ.27వేల కోట్లు చెల్లింపులు చేశారు. ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా అయితేనే కమీషన్లు భారీగా వస్తాయని కేసీఆర్ కుట్ర చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జూరాల నుంచి నీటిని తీసుకునేలా రూపొందించారు. జూరాల నుంచి అయితేనే లిఫ్ట్‌లు ఎక్కువ పెట్టలేమని భావించిన కేసీఆర్ దాన్ని శ్రీశైలానికి మార్చారు. తల దగ్గర నుంచి నీరు తీసుకునేది వదిలేసి తోక దగ్గర నీళ్లు తీసుకునేలా డిజైన్ చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 0.25 టీఎంసీలు మాత్రమే తీసుకునే దుస్థితి ఏర్పడింది. ఏపీ ప్రభుత్వం మాత్రం రోజుకు 13 టీఎంసీలు తరలించేలా ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నది. ఏపీలో పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమించుకున్నారని ఆరోపిస్తున్నారు. ఆయనకు తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నది. కేసీఆర్‌కు ఆహ్వానంపలుకుతున్నా.. శాసనసభలో చర్చ చేద్దాం రండి. సభలో మంచి సంప్రదాయాన్ని నెలకొల్పుదాం'' అని సీఎం అన్నారు.

# కేసీఆర్‌ను విమర్శిస్తే సూర్యుడి మీద ఉమ్మేసినట్లే



**మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు**

ఈ కబురు, హైదరాబాద్:

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్ రెడ్డి అని భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. టీఎంసీల కొద్దీ అబద్ధాలు, క్యూసెక్కుల కొద్దీ అజ్ఞానాన్ని పారించారని ఆరోపించారు. సీఎంకే బేసిన్లపై బేసిక్ నాలెడ్జ్ లేదన్నది బహిరంగ సత్యమని వ్యాఖ్యానించారు. నీటి ప్రాజెక్టులపై చర్చ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం చేసిన విమర్శలపై హరీశ్ రావు స్పందించారు. "కేసీఆర్‌ను, నన్ను ఉరి తీయాలంటూ సీఎం అనాగరిక వ్యాఖ్యలు చేశారు. నల్లమలసాగర్‌పై నా ప్రశ్నకు సూటిగా సమాధానం ఎందుకు చెప్పలేదు? బనకచర్ల మీద సుప్రీంలో పోరాటం నిజమైతే కమిటీ ఎందుకు వేశారు? కమిటీ వేయడం అంటేనే ఏపీ జలదోపిడీకి తలుపులు తెరవడం. 812 టీఎంసీల్లో తెలంగాణకు 69 శాతం దక్కాలని అప్పుడే డిమాండ్ చేశాం. బ్రిజేష్ ట్రైబ్యునల్ తుది తీర్పు వచ్చే వరకు 50:50 నిష్పత్తి కావాలని అడిగాం. కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్రం హామీ ఇస్తేనే కేసు విత్ డ్రా చేసుకున్నాం. కేసీఆర్‌ను విమర్శిస్తే సూర్యుడి మీద ఉమ్మేసినట్లే. తుంగభద్ర ద్వారా శ్రీశైలానికి 450 600 టీఎంసీలు వస్తాయనే జ్ఞానం సీఎంకు లేదు. జూరాల ప్రాజెక్టు కింద 5.50 లక్షల ఎకరాల్లో క్రాప్ హాలీడే ఎందుకు ప్రకటించారు? శ్రీశైలం మీద ఆధారపడిన కల్వకుర్తికి లోటు లేకుండా నీరు వస్తోంది. జూరాల మీద భారం పెడితే ఎవరికీ నీళ్లు రాక ఆగమైపోతారు. పాలమూరుకు 90 టీఎంసీలతో డీపీఆర్ పంపి 7 అనుమతులు తెచ్చాం. కాంగ్రెస్ ఈ రెండేళ్లలో ఒక్క అనుమతి తెచ్చింది లేదు'' అని హరీశ్ రావు విమర్శించారు.

మొదటి పేజీ తరువాయి

# ఏపీలో "పీఎం శ్రీ"క్రింద నాణ్యమైన విద్య



ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ)గా అభివర్ణిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా వివిధ రాష్ట్రాల్లోని పలు స్కూళ్లను తాజాగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఏపీలో ఏకంగా 935 స్కూళ్లను కేంద్రం ఎంపిక చేసింది. పీఎం శ్రీ పథకంలో భాగంగా ఆయా స్కూళ్లలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ఇతర విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతున్నారు. దీంతో కొత్త ఏడాదిలో ఆయా స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల కు పలు సౌకర్యాలు అందరూ ఉన్నాయి. పంట పండబోతోంది.ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దడం, ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే పీఎం శ్రీ పథకం ప్రధాన లక్ష్యమని ప్రధాని మోడీ ప్రకటించారు. రాష్ట్రాల సీఎస్ లతో జరిగిన భేటీలో పాల్గొన్న మన రాష్ట్ర సీఎస్ విజయానంద్ దీనిపై అనంతరం కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో పీఎం శ్రీ పథకం కింద 935 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఆయా స్కూళ్లను మెరుగైన రీతిలో అభివృద్ధి చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన, డిజిటల్ సాంకేతికతతో కూడిన విద్యను అందిస్తామని ప్రకటించారు.

## కొత్త సంవత్సరం వేళ

# కుమ్మేసిన మందుబాబులు

మొదటి పేజీ తరువాయి






నూతన సంవత్సరం వేళ రెండు తెలుగు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరిగాయి. ప్రతీ ఏడాది కంటే ఈ సారి ఏపీ తెలంగాణ రాష్ట్రాల్లోనూ మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. నెల రోజుల సమయంలో ఖజానాకు లిక్కర్ ఆదాయం భారీగా జమ అయింది. కొత్త సంవత్సరం వేళ మద్యం అమ్మకాల పైన ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా వెసులుబాటు కల్పించింది. దీంతో, మందుబాబులు అర్ధరాత్రి వరకు మద్యం కొనుగోలు చేసారు. దీంతో ఎక్సైజ్ శాఖ అంచనాలు మించి అమ్మకాలు జరిగాయి.తెలంగాణలో మద్యం అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. డిసెంబర్ నెలలో రికార్డులు సృష్టించాయి. డిసెంబర్ ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు డిపోల నుంచి 3వేల 459 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. గత ఏడాది డిసెంబర్‌లో 2వేల 764 కోట్ల 78 లక్షల లిక్కర్ సేల్స్ జరగగా ఈ ఏడాది సరికొత్త రికార్డు సృష్టించాయి. గత ఏడాది డిసెంబర్‌తో పోల్చితే ఈసారి సుమారు 7 వందల కోట్ల మద్యం అమ్మకాలు పెరిగినట్టు తెలుస్తోంది. న్యూఇయర్ సందర్భంగా తెలంగాణలో బుధవారం ఒక్కరోజే 171 కోట్ల 93 లక్షల మద్యం బిజినెస్ జరిగింది. ఒక్క డిసెంబర్ నెలలోనే రూ.5,050 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.కొత్త సంవత్సరం సందర్భంగా తెలంగాణలో మద్యం ఏలురై పారింది. డిసెంబర్ 31న రాత్రి బార్లు, పబ్బులు, క్లబుల్లో మద్యం విక్రయాలు భారీగా జరిగాయి. ఇక వైన్ షాపుల వద్ద భారీగా మందుబాబులు క్యూ కట్టి మద్యం కొనుగోలు చేసారు. తెలంగాణ ప్రభుత్వం అర్ధరాత్రి ఒంటి గంటల వరకు మద్యం దుకాణాలకు సమయమిచ్చింది. బార్లు, రెస్టారెంట్లు, పబ్స్ రాత్రి ఒంటి గంటల వరకు మద్యం సర్వ్ చేయడానికి అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో తెలంగాణలో లిక్కర్ సేల్స్ రికార్డు స్థాయిలో జరిగాయి. న్యూఇయర్ జోష్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 5 వేల కోట్ల విలువ చేసే మద్యం సేల్స్ జరిగినట్లు ఎక్సైజ్ గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి అదనంగా వెయ్యి కోట్ల రూపాయల లిక్కర్ సేల్స్ ఎక్కువగా జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలకు అనుమతి ఇచ్చారు. ఏపీలో కూడా లిక్కర్ సేల్స్ భారీ స్థాయిలో జరిగింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీగానే ఆదాయం చేకూరింది.

# ప్రజల గుండెల్లో కేసీఆర్ శాశ్వతం: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



**ఈ కబురు, హైదరాబాద్:**

**గెలుపోటములు తాత్కాలికమని.. ప్రజల గుండెల్లో కేసీఆర్ శాశ్వతమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ తిరోగమనం ప్రారంభమైందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో పార్టీ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. "యూరియా కోసం రైతులు చలికి వణుకుతూ క్యూలైన్‌లో ఉన్నారు. భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటై మనపై కత్తులు దూస్తున్నాయి. మనల్ని తుదముట్టించేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతవరకు మనల్ని ఎవరూ ఏం చేయలేరు. మనం విజయం సాధిస్తాం.. ధర్మం మనవైపు ఉంది" అని కేటీఆర్ అన్నారు.**

# రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు

**ఈ కబురు, హైదరాబాద్:**

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.80 వేల కోట్లు అవసరమని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చెప్పిందన్నారు. నీటి వాటాలపై అసెంబ్లీలో శుక్రవారం చర్చ జరగనున్న దృష్ట్యా 'నీళ్లు-నిజాలు' అంశంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఏపీ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు, ఇతరపథకాలపై ఉత్తమ్ వివరణ ఇచ్చారు. "పాలమూరు ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.80 వేల కోట్లకుపైగా కావాలి. రూ.80వేల కోట్ల ప్రాజెక్టుపై రూ.27వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పూర్తయినట్లా? మేం వచ్చాక రూ.7 వేల కోట్లు ఖర్చు చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టి తీయలేదని ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోంది" అని ఉత్తమ్ మండిపడ్డారు.



# ప్రధాని పేరిట మెయిల్స్.. రంగంలోకి సీబీఐ

ఢిల్లీలోని వసంత్‌కుంజ్‌కు చెందిన నిశీత్ కోహ్లీ తనను తాను టెక్స్‌టైల్ కెమిస్ట్రీ ఇంజినీర్‌గా పరిచయం చేసుకునేవాడు. స్వదేశీ యుద్ధవిమానం ఇంజిన్ రూపకల్పనకు సాయపడతానంటూ.. 2024 అక్టోబరు డిసెంబరు మధ్యకాలంలో డీఆర్‌డీవోకు చెందిన ఏడీఈ, ఇస్రో, హెచ్ఏఎల్, ప్రీమియర్స్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ తదితర సంస్థలకు మెయిల్స్ పంపాడు. ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి పేరును ప్రస్తావిస్తూ.. తనకు ప్రధాని మోదీ ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నాడు.ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ విచారణ ప్రారంభించింది. స్వప్రయోజనాల కోసం అతడు ప్రిన్సిపల్ కార్యదర్శితోపాటు ఏకంగా ప్రధాని పేరును దుర్వినియోగం చేసిన కేసుగా పరిగణించింది. అతడు తన వ్యక్తిగత మెయిల్ అకౌంట్ నుంచి మెయిల్స్ పంపినట్లు, పలువురు ఉన్నతాధికారులనూ వాటిలో ప్రస్తావించినట్లు గుర్తించింది. 2024 నవంబరులో అప్పటి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ ఎండీ టీవీ చౌదరీ.. నిందితుడి మెయిల్‌స్‌కు స్పందించినట్లు తెలిపింది. అదే ఏడాది డిసెంబరులో పెంటగాన్‌లోని అమెరికా నేవీకి చెందిన వైస్ అడ్మిరల్ జార్జ్ ఎం వికాఫ్‌కు కూడా నిందితుడు మెయిల్ చేసినట్లు సీబీఐ గుర్తించింది. సున్నితమైన అంశంపై మెయిల్స్ పంపడం వెనక అతడి ఉద్దేశాలను వెలికితీయడంలో నిమగ్నమైంది.

# ఎక్కువ మోతాదులో 'ఆస్ప్రిన్' తీసుకుంటున్నా - ట్రంప్



––డోస్ ఎక్కువగా తీసుకుంటున్నా.. "నా రక్తం పలుచగా ఉంచేందుకు ఆస్ప్రిన్ మంచిదని వైద్యులు అంటున్నారు. నా గుండెలో చిక్కటి రక్తం ప్రవహించడం నాకు ఇష్టం లేదు. మంచి, పలుచటి రక్తం నా హృదయంలో ప్రవహించాలని అనుకుంటున్నా" అని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. తాను కొంచెం మూఢనమ్మకాలను విశ్వసిస్తానని అన్నారు. కొన్ని నెలల క్రితం ఆసుపత్రి సందర్శన సందర్భంగా గుండె, పొత్తి కడుపుకు సంబంధించిన పరీక్షలు చేయించుకున్నందుకు చింతిస్తున్నానని, ఎందుకంటే తన ఆరోగ్యంపై ప్రజల్లో ప్రశ్నలు లేవనెత్తాయని అన్నారు. ట్రంప్ కుడి చేతిపై గాయం మరకలు ఉన్నాయని, ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారనే కొంతకాలం క్రితం వార్తలు వచ్చాయి. ఆ గాయాన్ని దాచడానికి ఆయన చేతికి మేకప్ వేసుకోవడం ఆ ఊహాగానాలకు మరింత ఊతమిచ్చినట్లైంది. అయితే, దీనిపై వైట్‌హౌస్ అప్పట్లో స్పందిస్తూ.. రక్తనాళాల్లో సమస్య ఉన్నట్లు నిర్ధరణ అయ్యిందని, అది వృద్ధుల్లో సాధారణంగా కనిపించేదేనని వెల్లడించింది.

# బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతల వేళ.. మరో హిందువుపై దాడి



**ఈ కబురు నెట్‌వర్క్ :**
బంగ్లాదేశ్ కొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. తాజాగా మరో హిందువును కొట్టి, నిప్పంటించిన ఘటన చోటుచేసుకుంది . స్థానిక మీడియా కథనాల ప్రకారం. షరియత్‌పూర్ జిల్లాకు చెందిన 50 ఏళ్ల ఖోకన్‌దాస్ తన పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా దాడి జరిగింది. ఒక మూక పదునైన ఆయుధాలతో దాడికి పాల్పడింది. తర్వాత నిప్పంటించింది. అయితే ఖోకన్ అక్కడి నుంచి తప్పించుకొని, పక్కనే ఉన్న చెరువులోకి దూకాడు. తర్వాత అతడిని స్థానికులు కాపాడారు. ఈ ఘటనను మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కాగా.. షేక్ హసీనా గద్దె దిగిన తర్వాత బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. ఈ రాజకీయ అస్థిర వాతావరణంలో హిందువులపై వరుస దాడులు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ హత్యతో తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఆ క్రమంలోనే హిందూ వ్యక్తులు దీపూ చంద్ర దాస్, అమృత్ మండల్ ప్రాణాలు కోల్పోయారు. మరో ఘటనలో బజేంద్ర బిశ్వాస్ తన సహోద్యోగి చేతిలో చనిపోయాడు. అనుకోకుండా చేయి ట్రిగ్గర్‌కు తాకడంతో తుపాకీ పేలిందని నిందితుడు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ వరుస ఘటనలను ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి.

# మస్క్ ఉదారత.. రూ 900 కోట్ల విలువైన షేర్ల విరాళం!



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఉదారత చాటుకున్నాడు. తాజాగా 100 మిలియన్ డాలర్ల విలువైన రెండు లక్షలకుపైగా టెస్లా షేర్లను తన స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇచ్చారు. అంటే మన దేశ కరెన్సీలో దాదాపు రూ.900 కోట్లు. ఈ విషయాన్ని డిసెంబర్ 30న స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో చూపించారు. టెస్లాలో ఎలాన్ మస్క్‌కు పది శాతం వాటా ఉంది. 'ఏడాది చివరి పన్ను ప్రణాళిక'లో భాగంగా కొన్ని షేర్లను ఛారిటీలకు విరాళంగా ఇచ్చానని మస్క్ పేర్కొన్నారు. వాటిని విక్రయించే ఉద్దేశం లేదని ఫైలింగ్‌లో వెల్లడించారు.
స్వచ్ఛంద సంస్థలకు కొన్నేళ్లుగా ఎలాన్ మస్క్ విరాళాలు ఇస్తూనే ఉన్నారు. 2024లో 112 మిలియన్ డాలర్ల (రూ.వెయ్యి కోట్ల పైమాటే) విలువైన షేర్లను డొనేట్ చేశారు. అంతకుముందు 2022లో దాదాపు 1.95 బిలియన్ డాలర్లు, 2021లో 5.74 బిలియన్ డాలర్ల విలువ కలిగిన షేర్లను మస్క్ ఫౌండేషన్‌కు ఇచ్చారు. అయితే, విక్రయించడానికి బదులు.. ఇలా షేర్లనే విరాళంగా ఇస్తే మూలధన లాభాల (Capital gains) పన్ను పరిధిలోకి రావని విశ్లేషకులు చెబుతున్నారు. ఛారిటీలకూ ఆర్థికంగా బలంగా ఉంటుందంటున్నారు. మరోవైపు ఛారిటీ మస్క్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. మానవాళికి ప్రయోజనం చేకూర్చే సురక్షిత కృత్రిమ మేధ అభివృద్ధికి భారీగా ఖర్చు పెడుతున్నారు.
మిలియన్ డాలర్ల విలువైన షేర్లను విరాళంగా ఇస్తున్నప్పటికీ.. ప్రపంచ కుబేరుల్లో మస్క్ అగ్ర స్థానంలో కొనసాగుతున్నారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం ప్రస్తుతం ఆయన సంపద విలువ 619 బిలియన్ డాలర్లు. ఆయన తర్వాత గూగుల్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ పేజ్, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఉన్నారు.

# న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం.. స్విట్జర్లాండ్ బార్‌లో అగ్నిప్రమాదం

నూతన సంవత్సర వేడుకలు విషాదంగా మారాయి. స్విట్జర్లాండ్‌లోని వాలిస్ కాంటన్ ప్రాంతంలో ఓ బార్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 40 మంది మృతి చెందగా, 100 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. న్యూ ఇయర్ వేడుకల కోసం పెద్ద సంఖ్యలో యువత బార్‌లో గుమికూడిన సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు మొత్తం భవనాన్ని చుట్టుముట్టడంతో భారీ ప్రాణనష్టం సంభవించింది. విలేకరుల సమావేశంలో వాలిస్ కాంటన్ పోలీస్ కమాండర్ ఫ్రెడెరిక్ గిస్లెర్ మాట్లాడుతూ.. ఈ ఘటనలో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అయితే అగ్నిప్రమాదానికి గల కారణాన్ని తేల్చడానికి ఇంకా సమయం పడుతుందని వాలిస్ కాంటన్ అటార్నీ జనరల్ బీట్రైస్ పిలోడ్ తెలిపారు. అయితే ఇద్దరు ఫ్రెంచ్ ప్రత్యక్ష సాక్షులు ఎమ్మా, అల్బెన్ మాట్లాడుతూ.. పైకప్పుకు చాలా దగ్గరగా ఉంచిన కొవ్వొత్తులే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని చెప్పారు. బార్‌లో షాంపైన్ సీసాలపై పుట్టినరోజు కొవ్వొత్తులు వెలిగించి పైకి ఎత్తిన సమయంలో మంటలు చెలరేగినట్లు తెలిపారు.
ఓ ఫ్రెంచ్ న్యూస్ ఛానల్ ప్రకారం.. ఒక వెయిట్రెస్ షాంపైన్ సీసాలపై కొవ్వొత్తులు ఉంచి పైకప్పు వైపు ఎత్తారు. దాంతో కొన్ని క్షణాల్లోనే మొత్తం పైకప్పు మంటల్లో చిక్కుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అంతా కలప, మట్టితో చేసిన నిర్మాణం కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి అని వారు వెల్లడించారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే బార్‌లో ఉన్న సుమారు 200 మంది బయటకు పరుగులు తీశారు. అయితే బయటకు వెళ్లే మార్గాలు చాలా ఇరుకుగా ఉండటం, మెట్లు మరింత సన్నగా ఉండటంతో సహాయక చర్యలు తీవ్రంగా కష్టమయ్యాయి. 30 సెకన్లలోనే 200 మంది బయటకు రావడానికి ప్రయత్నించారు. అది భయంకర దృశ్యం అని ఓ ప్రత్యక్ష సాక్షి తెలిపారు. బాధితుల్లో ఎక్కువ మంది 16 నుంచి 26 ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం. వీరిలో పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

**ఉగ్రవాద కోణం లేదని స్పష్టం**

**ఈ ఘటన ఉగ్రవాద దాడి కాదని, ఇది పూర్తిగా అగ్నిప్రమాదమేనని పోలీసులు స్పష్టం చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పూర్తిగా మూసివేసినట్లు తెలిపారు. అలాగే క్రాన్స్-మోంటానా ప్రాంతం పైన నో-ఫ్లై జోన్ విధించినట్లు పోలీసులు ప్రకటించారు.అగ్నిప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.**






## తెలంగాణ పోలీసుల అదుపులో మావోయిస్టు అగ్రనేత బర్సె దేవా?



ఈ కబురు: హైదరాబాద్: తెలంగాణ పోలీసుల అదుపులో మావోయిస్టు అగ్రనేత బర్సె దేవా అలియాస్ సుక్కాతో పాటు 15 మంది మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం. సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన దేవా.. హిడ్మాతో కలిసి పనిచేసినట్టు చెబుతున్నారు. బర్సె దేవాపై రూ. 50లక్షల రివార్డు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మరో వైపు మావోయిస్టులను కోర్టులో హాజరు పర్చాలని పౌరహక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మావోయిస్టుల అరెస్ట్‌పై పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

## రామ జన్మభూమి ఉద్యమం మహోన్నత గాథ



**సిందూర్'లో రాముడి ఆశయాలు పాటించాం**

**రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి**

**అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ట రెండో వార్షికోత్సవం**

అయోధ్య: దేశంలో రామ జన్మభూమి ఉద్యమం ఒక మహోన్నత గాథ అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. ఈ ఉద్యమం భవిష్యత్తుకు పునాది వేసిందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో శ్రీరాముడి ఆశయాల మేరకు మన దేశం నడుచుకున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో బుధవారం భవ్య రామమందిర ప్రాణప్రతిష్ట రెండో వార్షికోత్సవంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు.
గర్భాలయంలో బాల రాముడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రామ మందిరం ప్రాంగణంలోని అన్నపూర్ణ ఆలయంపై ధ్వజారోహణ గావించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. భారతీయ సనాతన సంప్రదాయాలను అంతం చేయడానికి విదేశీ దురాక్రమణదారులు ఎన్నో కుట్రలు సాగించారని చెప్పారు. అయినప్పటికీ నేడు రామ మందిరంపై కాషాయ ధ్వజం సగర్వంగా రెపరెపలాడుతూ నాగరికత కొనసాగింపు సందేశాన్ని ఇస్తోందని హర్షం వ్యక్తంచేశారు.
వినమ్రతకు, మంచితనానికి మారుపేరైన శ్రీరాముడు అవసరమైతే దుష్టులను అంతం చేయడానికి ఉగ్రరూపం కూడా దాలుస్తాడని రాజ్‌నాథ్ ఉద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో రాముడిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లామని స్పష్టంచేశారు. రాముడి అసలు లక్ష్యం రావణుడిని అంతం చేయడం కాదని.. అధర్మాన్ని నిర్మూలించడమేనని అన్నారు. అదే తరహాలో ఉగ్రవాదులకు, వారి పోషకులకు బుద్ధి చెప్పడమే మన ధ్యేయమని వెల్లడించారు. ఆధునిక భారతదేశం సంఘర్షణల్లోనూ 'మర్యాద'కు కట్టుబడి ఉంటుందన్నారు. అయోధ్యలో రాముడు కొలువుదీరడం కళ్లారా చూస్తున్నామని, అది మనకు గొప్ప సంతృప్తి ఇస్తోందని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

**దశాబ్దంలో అయోధ్యలో పెనుమార్పులు: యోగి**

ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో గత దశాబ్దకాలంలో అయోధ్యలో పెనుమార్పులు వచ్చా యని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ చె ప్పారు. గతంలో కొందరు వ్యక్తులు, మతోన్మాదు లు అయోధ్యను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారని విమర్శించారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. రామమందిర ప్రాణప్రతిష్ట రెండో వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు.
రామ జన్మభూమి ఉద్యమంలో రాజ్‌నాథ్ సింగ్ చురుకైన పాత్ర పోషించారంటూ ప్రశంసించారు. 500 ఏళ్ల తర్వాత రామ మందిరం సాకారం కావడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని పేర్కొన్నారు. నగరానికి గతంలో తరచుగా ఉగ్రవాద బెదిరింపులు వచ్చేవని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నగరం పూర్తి సురక్షితంగా మారిందన్నారు. గత ఐదేళ్లలో 45 కోట్ల మంది భక్తులను అయోధ్యను దర్శించుకున్నట్లు యోగి ఆదిత్యనాథ్ తెలిపారు.

**మన విశ్వాసం, సంప్రదాయాల వేడుక: మోదీ**

అయోధ్య రామాలయ ప్రాణప్రతిష్ట ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది మన విశ్వాసం, సంప్రదాయాల మహోన్నత దైవిక వేడుక అని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశ విదేశాల్లోనికోట్లాది మంది రామ భక్తుల తరపున అయోధ్య రాముడి పాదపద్మాలకు వినమ్రంగా నమస్కరిస్తున్నట్లు ఉద్ఘాటించారు.

**రాముడి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు చేకూరాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. ఐదు శతాబ్దాల ప్రజల సంకల్పం రెండు సంవత్సరాల క్రితం నెరవేరిందని వివరించారు. రామ్‌లల్లా ప్రతిష్ట ద్వాదశికి ఆలయంపైనున్న ధర్మధ్వజం ఒక ప్రతీకగా నిలుస్తోందన్నారు. గత నెలలో జరిగిన ధర్మధ్వజ వేడుకలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి హృదయం సేవ, అంకితభావం, కరుణ అనే భావనలతో నిండిపోవాలని, స్వయం సమృద్ధ భారత్‌కు అదే పునాది అని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు.**

# హెచ్1బీ వీసాల ఆలస్యం.. భారత ఉద్యోగులకు అమెజాన్ ఊరట




హెచ్1బీ వీసా (visa) అపాయింట్‌మెంట్ కోసం వేచి చూస్తూ భారత్‌లో ఉండిపోయిన తమ ఉద్యోగులకు అమెజాన్ ఊరట కలిగించే విషయం చెప్పింది. ఐదు రోజుల ఆఫీసు నిబంధనను సడలించి, మార్చి వరకు రిమోట్‌గా (Work From Home) పనిచేసేందుకు వెసులుబాటు కలిగించింది. ఇందుకు కొన్ని షరతులు విధించినట్లు సమాచారం. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు అడ్వైజరీ పంపినట్టు తెలిసింది.

హెచ్1బీపై అమెరికాలో పనిచేస్తూ వివిధ కారణాలతో భారత్ వచ్చిన అమెజాన్ ఉద్యోగులు.. వీసా అపాయింట్‌మెంట్‌లో జాప్యం కారణంగా ఇక్కడే ఉండిపోయారు. ఇలా డిసెంబర్ 13 నాటికి భారత్‌కు వచ్చి, రీషెడ్యూల్ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులకు ఈ ఏడాది మార్చి 2 వరకు ఇంటి నుంచే పని చేసుకునేందుకు అమెజాన్ అనుమతి ఇచ్చింది.

ఈ సమయంలో కోడింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, సంబంధిత వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం లేదా కస్టమర్లతో మాట్లాడటం వంటివి చేయకూడదని స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. వీటితోపాటు భారత్‌లో ఉన్న అమెజాన్ కార్యాలయాలకు వెళ్లకూడదని ఆదేశించింది.

హెచ్1బీ వీసా అపాయింట్‌మెంట్‌లో జాప్యం కారణంగా అమెజాన్‌తో పాటు గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వీసా రీఎంట్రీ ప్రక్రియకు నెలల సమయం పట్టే అవకాశం ఉందని, అందుకే అమెరికాను వీడి బయటకు వెళ్లొద్దని గూగుల్ ఇటీవల తన ఉద్యోగులకు సూచించిన విషయం తెలిసిందే.

## ఉక్కు దిగుమతులపై సేఫ్‌గార్డ్ సుంకాల పొడిగింపు

కొన్ని ఉక్కు ఉత్పత్తుల దిగుమతులపై సేఫ్‌గార్డ్ సుంకాలను మూడేళ్ల పాటు కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. చైనా వంటి దేశాల నుంచి వచ్చే చౌక దిగుమతుల నుంచి దేశీయ తయారీదార్లను రక్షించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2025 ఏప్రిల్ 21న మొదటిసారిగా ఉక్కు ఉత్పత్తులపై 200 రోజుల పాటు తాత్కాలికంగా 12% సుంకాన్ని కేంద్రప్రభుత్వం విధించింది. తాజా ఆదేశాలతో ఈ సుంకాలు 2028 ఏప్రిల్ వరకు కొనసాగనున్నాయి. మొదటి ఏడాది (2025 ఏప్రిల్ 21 నుంచి 2026 ఏప్రిల్ 20)లో 12% సేఫ్‌గార్డ్ సుంకాన్ని విధిస్తారు. రెండో ఏడాది (2026 ఏప్రిల్ 21 నుంచి 2027 ఏప్రిల్ 20)లో దాన్ని 11.5 శాతానికి, మూడో ఏడాది (2027 ఏప్రిల్ 21 నుంచి 2028 ఏప్రిల్ 20)లో 11 శాతానికి తగ్గించనున్నారు. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 4.89%, సెయిల్ 4.18%, జిందాల్ స్టీల్ 2.75%, టాటా స్టీల్ 2.45% లాభపడ్డాయి.



## డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.1.74 లక్షల కోట్లు




దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్లు (GST collections) స్వల్ప వృద్ధి నమోదైంది. 2025 డిసెంబర్ నెలలో స్థూలంగా రూ.1.74 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 6.1 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. జీఎస్టీ రేట్ల కోత కారణంగా దేశీయ విక్రయాల నుంచి వచ్చే వసూళ్లు నెమ్మదించినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు డిసెంబర్ నెలకు సంబంధించిన గణాంకాలను గురువారం విడుదల చేసింది.

2024 డిసెంబర్ నెలలో రూ.1.64 లక్షల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల్లో 1.2 శాతం వృద్ధితో రూ.1.22 లక్షల కోట్లు వసూళ్లు నమోదు కాగా.. దిగుమతైన వస్తువులపై జీఎస్టీ వసూళ్లు (19.7 శాతం వృద్ధి) రూ.51,977 కోట్లుగా ఉన్నాయి. రిఫండ్ల రూపంలో రూ.28,980 కోట్లు తిరిగి చెల్లించినట్లు కేంద్రం పేర్కొంది. దీంతో నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.45 లక్షల కోట్లుగా లెక్క తేలింది. నికర వసూళ్లలో గతేడాదితో పోలిస్తే కేవలం 2.2 శాతం మాత్రమే వృద్ధి నమోదైంది. గతేడాది సెప్టెంబర్ 22న 375 రకాల వస్తువులపై జీఎస్టీ రేట్లను కేంద్రం తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో ఆ మేర రెవెన్యూపై ప్రభావం చూపింది.

# ఏటీఎఫ్ ధర తగ్గింది.. ఎల్పీజీ ధర పెరిగింది!



దిల్లీ: విమానాల్లో వినియోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF) ధరలను ప్రభుత్వరంగ చమురు కంపెనీలు భారీగా తగ్గించాయి. విమానయాన రంగానికి ఊరట కల్పిస్తూ ఏటీఎఫ్ ధరలో 7.3 శాతం మేర కోత పెట్టాయి. అదే సమయంలో కమర్షియల్ సిలిండర్ ధరలను (LPG price hike) రూ.111 చొప్పున పెంచాయి. నెలవారీ మదింపులో భాగంగా అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా చమురు సంస్థలు ఈ ధరల సవరణ చేపట్టాయి. పెరిగిన ధరలు నేటినుంచే అమల్లోకి రానున్నాయి.

ధరల సవరణ తర్వాత దిల్లీలో ఏటీఎఫ్ ధర కిలో లీటరుకు రూ.7,353.75 తగ్గి రూ.92,323.02కి చేరింది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లలో వరుసగా మూడుసార్లు ఏటీఎఫ్ ధరలను పెంచుతూ వచ్చాయి. చమురు కంపెనీల తాజా నిర్ణయంతో విమానయాన సంస్థలపై ఆర్థికంగా భారం తగ్గనుంది. విమానాలు నడిపేందుకు అయ్యే మొత్తం ఖర్చులో ఏటీఎఫ్‌దే 40 శాతం వాటా. స్థానిక ట్యాక్సుల కారణంగా ఏటీఎఫ్ ధర దేశంలోని ఒక్కో నగరంలో ఒక్కోలా ఉంటుంది.

అటెన్షన్ ప్లీజ్.. నేటి నుంచే ఈ మార్పులు

మరోవైపు 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధరను చమురు కంపెనీలు రూ.111 చొప్పున పెంచాయి. తాజా నిర్ణయంతో దిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,691.50కి చేరింది. గత రెండు నెలలుగా ఈ ధరలను చమురు కంపెనీలు తగ్గించుకుంటూ వచ్చాయి. ధరల పెంపు నిర్ణయంతో హోటళ్లు, రెస్టరంట్లపై భారం పడనుంది. అదే సమయంలో ఇంట్లో వాడే ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. చివరిసారిగా 2025 ఏప్రిల్‌లో రూ.50 చొప్పున పెంచాయి. అంతర్జాతీయ ధరలు, రూపాయి మారకం విలువ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఐఓసీ, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం ఏటీఎఫ్, ఎల్పీజీ ధరలను ప్రతినెలా ఒకటో తేదీన సవరిస్తుంటాయి.

# ఐపీవోకు ఓయో




**సెబీకి తాజాగా ప్రాస్పెక్టస్ దాఖలు**

న్యూఢిల్లీ: గ్లోబల్ ట్రావెల్ టెక్ సంస్థ ప్రిజమ్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుమతించమంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. ప్రైమరీ మార్కెట్లో ఇటీవల కనిపిస్తున్న ట్రెండ్‌కు అనుగుణంగా ఓయో బ్రాండ్ కంపెనీ సైతం గోప్యతా విధానంలో ప్రాస్పెక్టస్ సమరోపించింది. ఐపీవో ద్వారా రూ. 6,650 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో 7-8 (సుమారు రూ. 72,000 కోట్లు) బిలియన్ డాలర్ల విలువను ఆశిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

2025 డిసెంబర్ 20న నిర్వహించిన అసాధారణ సమావేశం(ఈజీఎం)లో కొత్తగా ఈక్విటీ జారీ ద్వారా రూ. 6,650 కోట్లు సమీకరించేందుకు వాటాదారుల నుంచి అనుమతి పొందిన విషయం విదితమే. కంపెనీ ఇంతక్రితం 2021లో తొలుత రూ. 8,430 కోట్ల సమీకరణ కోసం సెబీకి దరఖాస్తు చేసింది. తదుపరి 2023లో తాజా ఫైనాన్షియల్, నిర్వహణ సంబంధ సమాచారంతో ఫైలింగ్ చేసినప్పటికీ అనిశ్చిత మార్కెట్ పరిస్థితుల కారణంగా ఐపీవో యోచనను విరమించుకుంది. 2012లో రితేష్ అగర్వాల్ ఏర్పాటు చేసిన కంపెనీలో పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ అతిపెద్ద వాటాదారుగా ఉంది.

# ఆర్థిక వ్యవస్థలో భారత్.. జర్మనీని అధిగమించాలంటే?



2025 చివరి నాటికి భారతదేశం జపాన్‌ను అధిగమించి.. ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సమీక్ష ప్రకారం.. ఇండియా జీడీపీ 4.18 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇక మన దేశం ముందున్న టార్గెట్ జర్మనీని అధిగమించడమే.

అమెరికా, చైనా, జర్మనీ తర్వాత నాలుగవ స్థానంలో నిలిచిన భారత్.. ఇప్పుడు ప్రపంచంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటి. ఇప్పుడు నాలుగవ స్థానం నుంచి జర్మనీని అధిగమించి.. మూడో స్థానంలోకి చేరుకోవడానికి గట్టిగా కృషి చేయాలి. దేశం మరింత సమృద్ధిగా మారాలి. 2030 నాటికి భారత్ తన లక్ష్యాన్ని చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**లక్షలాది ఉద్యోగాలు అవసరం**

జనాభా పరంగా.. భారతదేశం 2023లో దాని పొరుగు దేశమైన చైనాను అధిగమించి అత్యధిక జనాభా కలిగిన దేశంగా నిలిచింది. అయితే ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలో మాత్రం నాలుగవ స్థానంలో నిలిచింది. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం.. 2024లో భారతదేశ తలసరి జీడీపీ 2,694 డాలర్లుగా ఉంది. ఇది జపాన్ కంటే 12 రెట్లు, జర్మనీ కంటే 20 రెట్లు తక్కువ.

ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. భారతదేశంలోని 1.4 బిలియన్ల జనాభాలో నాలుగో వంతు కంటే ఎక్కువ మంది 10-26 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఉన్నారు. కాబట్టి దేశం లక్షలాది మంది యువ గ్రాడ్యుయేట్లకు మంచి జీతంతో కూడిన ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం ఉంది.

**రూపాయి పతనం & ఆర్థిక సవాళ్లు**

అమెరికాతో వాణిజ్య ఒప్పందం లేకపోవడం, దేశ వస్తువులపై సుంకాల ప్రభావం గురించి కొనసాగుతున్న ఆందోళనల కారణంగా, డిసెంబర్ ప్రారంభంలో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ భారీగా తగ్గింది. 2025లో రూపాయి విలువ దాదాపు ఐదు శాతం పడిపోయింది.


**2047 నాటికి..**

ప్రస్తుతం.. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉంది. ఈ ఊపును ఇదే మాదిరిగా కొనసాగిస్తూ.. 2047 నాటికి (స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ల సందర్భంగా) అధిక మధ్య ఆదాయ స్థితిని సాధించాలనే ఆశయంతో, దేశం ఆర్థిక వృద్ధి, నిర్మాణాత్మక సంస్కరణలు & సామాజిక పురోగతి యొక్క బలమైన పునాదులపై నిర్మిస్తోంది" అని ప్రభుత్వం తెలిపింది.



# న్యూఇయర్ స్పెషల్..


# ప్రభాస్ 'స్పిరిట్' ఫస్ట్ లుక్ వచ్చేసింది..




**ప్రభాస్ (Prabhas) కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా (Sandeep Reddy Vanga) దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' (Spirit). నూతన సంవత్సరం సందర్భంగా డార్లింగ్ అభిమానులకు దర్శకుడు సందీప్ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. మూవీలోని ప్రభాస్ లుక్‌ను (spirit first look) విడుదల చేశారు. ఇప్పటివరకూ తెరపై చూడని సరికొత్త అవతారంలో ప్రభాస్ కనిపించారు. ఒళ్లంతా గాయాలతో కమిలిపోయి ఉండగా, బ్యాండ్-ఎయిడ్‌లు కట్టుకుని ప్రభాస్ వెనక్కి తిరిగి నిలబడ్డారు. ఆయన ముందు త్రిప్తి దిమ్రీ నిలబడి ఉంది.**

రా అండ్ రస్టిక్‌గా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. చూడడానికి 'యానిమల్'లో రణ్‌బీర్ పాత్ర ఛాయలు కనిపిస్తున్నా, ప్రభాస్ కటౌట్ కావడంతో అంతకు మించిన హైఓల్టేజ్ యాక్షన్ చూపించబోతున్నట్లు అర్థమవుతోంది. 'ఇండియన్ సినిమా.. మీ ఆజానుబాహుడు/ఆజానుబాహు'ను చూడండి. హ్యాపీ న్యూఇయర్ 2026' అని సందీప్ వంగా పేర్కొన్నారు. 'మీరు ఇప్పటివరకూ ఉన్న దానిని ప్రేమించారు. ఇక నుంచి మీకు తెలియనిదానితో ప్రేమలో పడండి' అని టీమ్ పేర్కొంది. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. సినిమా ప్రారంభం సందర్భంగా 'సౌండ్ స్టోరీ' పేరుతో ఓ ఆడియో టీజర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. ప్రభాస్ అకాడమీ టాపర్ అయిన ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్టు తెలుస్తోంది. పోలీసు అధికారి అయినా రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడ జైలర్‌గా ఉన్న ప్రకాశ్‌రాజ్‌కీ, ప్రభాస్‌కీ మధ్య సంభాషణ టీజర్‌కి ఆకర్షణగా నిలిచిందిపోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఇందుకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులకు థ్రిల్ పంచుతాయని తెలుస్తోంది. ఇదే కథకు ప్రాణమని, మొత్తం సినిమాను మలుపు తిప్పే ఎపిసోడ్ అవుతుందని అంటున్నారు. దీనిపై స్పష్టత రావాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఇక ఇందులో త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. టి సిరీస్, భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్ సంస్థలపై ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్, క్రిషన్‌కుమార్ నిర్మిస్తున్నారు.

## నిర్మాతగా జనసేన కార్యదర్శి.. డిజాస్టర్ దర్శకుడితో పవన్ సినిమా



పవన్ కల్యాణ్ హీరోగా, సురేందర్ రెడ్డి దర్శకత్వంలో కొత్త సినిమాను ప్రకటించారు. జనసేన ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. తాజాగా అధికారికంగా ప్రకటించారు. ఈ మూవీలో పవన్ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. వీరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని చాలారోజుల క్రితమే ప్రకటించారు.

దర్శకుడు సురేంద్ర రెడ్డి 2023లో తెరకెక్కించిన ఏజెంట్ సినిమా భారీ డిజాస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ మూవీ తర్వాత ఆయన మరో సినిమా ప్రకటించలేదు. అయితే, తాజాగా పవన్ కల్యాణ్‌తో సినిమా చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. వక్కంతం వంశీ ఈ ప్రాజెక్ట్‌కు కథ అందిస్తున్నాడు. అయితే, డైరెక్టర్ సురేందర్ రెడ్డి ఇప్పటికే రవితేజకు ఈ కథను వినిపించారని సమాచారం. పలు కారణాల వల్ల షూటింగ్ వరకు చేరలేదని టాక్ వుంది.


గతంలో ఆయన తెరకెక్కించిన సైరా నరసింహారెడ్డి, ఏజెంట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో సరైన కథ కోసం సురేంద్ర రెడ్డి ప్లాన్ చేస్తుండగా వక్కంతం వంశీ చెప్పిన కథతో పవన్ వద్దకు వెళ్లడంతో ఆయన ఓకే చేసినట్లు సమాచారం. హైదరాబాద్‌లో గన్ కల్చర్ కాన్సెప్ట్‌తో ఈ మూవీ రానుందని తెలుస్తోంది. అయితే, ఇదే స్టోరీని రవితేజకు చెబితే నో అన్నారని టాక్ ఉంది. నిర్మాత రామ్ తాళ్లూరి గతంలో రవితేజతో నేల టికెట్టు, డిస్కో రాజా చిత్రాలను నిర్మించారు.



## రాజకీయ నాయకుడిగా విశ్వక్‌సేన్.. ఆసక్తికరంగా 'లెగసీ' టీజర్




'రాజకీయమంటే పులిమీద సవారిలాంటిదంటారు. ఆ పులి మీద నాయకుడు ఒక్కడే కూర్చోవాలా? ఆ కుటుంబం మొత్తం కూర్చోవాలా? 'అని ప్రశ్నిస్తున్నారు విశ్వక్‌సేన్. ఆయన కీలక పాత్రలో సాయి కిరణ్‌రెడ్డి రూపొందిస్తున్న పొలిటికల్ థ్రిల్లర్ 'లెగసీ' (Legacy Movie). పాలిటిక్స్ ఈజ్ పర్సనల్ అనేది ఉప శీర్షిక. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో విశ్వక్‌సేన్ రాజకీయ నాయకుడిగా భిన్నమైన పాత్రలో కనిపించారు. ఏక్తా రాథోడ్, రావు రమేశ్, సచిన్ ఖేడ్కర్, మురళీ మోహన్, కేకే మేనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు



## ఒక్క సినిమానే చేస్తా! ఇప్పటికే చాలా నేర్చుకున్నా..

స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' మూవీతో వెండితెరపై హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది బాలీవుడ్ బ్యూటీ ఆలియా భట్. తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఈమె చివరగా జిగ్రా (2024) సినిమాలో కనిపించింది. 2025లో ఒక్క సినిమా కూడా చేయలేదు. ప్రస్తుతం ఆల్ఫా, లవ్ అండ్ వార్ మూవీస్ చేస్తోంది.

అర్థం చేసుకోగలిగా..

తాజాగా ఆలియా భట్ మాట్లాడుతూ.. నేను హార్ట్ ఆఫ్ స్టోన్ అనే హాలీవుడ్ సినిమా చేశాను. కానీ అందులో నా పాత్రకు మరీ ఎక్కువ స్టంట్ సీన్లు లేవు. కానీ ఆల్ఫా మూవీలో ఎక్కువ యాక్షన్ సన్నివేశాల్లో నటించాను. పాప పుట్టాక ఇలాంటి సీన్లలో నటించడం కొత్త అనుభూతినిచ్చింది. నా శరీరం ఇటువంటి సన్నివేశాల్లో నటించేందుకు ఏమేరకు సహకరిస్తుందనేది అర్థం చేసుకోగలిగాను.

అదే నేర్చుకున్నా..

లవ్ అండ్ వార్ మూవీ అయితే నాకు ఎంతో ప్రత్యేకం. ఈ సినిమా కోసం పనిచేస్తున్నప్పుడు ఎప్పుడూ అలిసిపోయినట్లుగా అనిపించలేదు. సంజయ్ లీలా భన్సాలీతో పని చేయడం అందమైన అనుభవాలను మిగిల్చింది. సెట్‌లో ఎంతగానో నేర్చుకున్నాను. గంగూభాయ్ కతియావాడి సెట్‌లో మైండ్‌లో ఎక్కువ ఆలోచనలు పెట్టుకోకుండా.. ఖాళీ మైండ్‌తో ముందుకు వెళ్లాలని నేర్చుకున్నాను. అప్పుడే అన్నింటినీ పరిశీలించొచ్చు, గమనించి నేర్చుకోవచ్చు.

రెండూ బ్యాలెన్స్

ఒకేసారి ఎక్కువ సినిమాలు చేయాలనుకోవడం లేదు. ఒక్కసారి ఒక ప్రాజెక్టులో మాత్రమే నటించాలనుకుంటున్నాను. ఓ పక్క కూతురు రాహాను చూసుకుంటూ మరోపక్క ఏదైనా ఒక సినిమాలో మాత్రమే లీనమవ్వాలని భావిస్తున్నాను. ప్రస్తుతానికి నా పనిని ఆస్వాదిస్తున్నాను అని చెప్పుకొచ్చింది.

## సైక్ సిద్ధార్థ.. నందు కొత్త చిత్రం విజయాన్ని ఇచ్చిందా?

**చిత్రం: సైక్ సిద్ధార్థ; నటీనటులు: శ్రీనందు, యామిని భాస్కర్, ప్రియాంక రెబకా, సింహ, సుఖేష్‌రెడ్డి తదితరులు; సంగీతం: సమ్రాన్ సాయి; సినిమాటోగ్రఫీ: కె.ప్రకాశ్‌రెడ్డి; ఎడిటర్: ప్రతీక్ నూతి; నిర్మాత: శ్రీనందు, రానా దగ్గుబాటి; దర్శకత్వం: వరుణ్‌రెడ్డి; విడుదల: 01-01-2026**

పరిమిత వ్యయంతో రూపొందిన సినిమాల విడుదలతో కొత్త ఏడాదిని ప్రారంభించింది తెలుగు బాక్సాఫీస్. అందులో రెండు సినిమాలు యువ నటుడు శ్రీ నందు నటించినవే కావడం విశేషం. 'సైక్ సిద్ధార్థ'లో కథానాయకుడు కాగా, 'వనవీర'లో ప్రతినాయకుడు. సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ విడుదల చేయడం 'సైక్ సిద్ధార్థ'కు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తిని రేకెత్తించింది. అందుకు తగ్గట్టుగా సినిమా ఉందా?ఈ సిద్ధార్థ ఎలా ఉన్నాడు? కథేంటంటే..

సిద్ధార్థ (శ్రీనందు) అనుకోకుండా పరిచయమైన త్రిష (ప్రియాంక)తో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత ఆ ఇద్దరూ.. మరో భాగస్వామి మన్సూర్ (సుఖేష్‌రెడ్డి)తో కలిసి ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రారంభిస్తారు. అందులో రూ.2 కోట్ల పెట్టుబడి సిద్ధార్థదే. కానీ, కథ అడ్డం తిరుగుతుంది. మన్సూర్, త్రిష మనసులు ఇచ్చి పుచ్చుకుని సిద్ధార్థని వ్యక్తిగతంగానూ, వ్యాపారంలోనూ మోసం చేస్తారు. దాంతో కోట్లు పోగొట్టుకుని రోడ్డుపైకి వచ్చేస్తాడు సిద్ధార్థ. మానసికంగా కలత చెందిన అతడు.. ఓ బస్తీలోని బిల్డింగ్‌లో చిన్న గది అద్దెకు తీసుకుని అక్కడే గడుపుతుంటాడు. అదే బిల్డింగ్‌లోకి తన కొడుకుతో కలిసి అద్దెకు దిగుతుంది శ్రావ్య (యామినీ భాస్కర్). ఆమెది మరో కథ. భర్త వేధింపులు తాళలేక బయటికొచ్చిన ఓ మహిళ శ్రావ్య. మరి సిద్ధార్థకి ఎలా దగ్గరైంది?శ్రావ్య కలిశాక సిద్ధార్థ జీవితంలో చోటు చేసుకున్న మార్పు ఎలాంటిదనే విషయాన్ని తెరపై చూడాలి.

**ఎలా ఉందంటే..**

కొత్త కథలంటూ ఏమీ ఉండవు. కొత్తగా చెప్పడమే ఉంటుందనే మాట సినీ జనాల నుంచి తరచూ వినిపిస్తుంటుంది. ఆ మాటల్ని నవతరం దర్శకులు ఎలా అర్థం చేసుకొంటున్నారో కానీ, మాకు కథ కూడా పెద్దగా అవసరం లేదన్నట్టు అరకొరగానే స్పృశిస్తూ, పూర్తిగా కథనంతో మేజిక్ చేయాలనే ప్రయత్నంలోనే కనిపిస్తుంటారు. దాంతో చాలా సినిమాల్లోని కంటెంట్ షార్ట్ ఫిలింకి ఎక్కువ, సినిమాకి తక్కువ అనే భావన కలిగిస్తుంటుంది. ఈ సినిమా విషయంలోనూ అదే జరిగింది. పూర్వోత్తరాలు కూడా లేని ఓ పాత్రకు సంబంధించిన ఓ ఫేజ్‌ని, అలాంటి మరికొన్ని పాత్రలతో ముడిపెడుతూ ఈ సినిమాని తీర్చిదిద్దాడు దర్శకుడు. హృదయం ముక్కలైపోయిన ఓ యువకుడిలో ఆవేశం ఎలా ఉంటుందో, చుట్టూ మనుషుల్ని ఎలా చూస్తాడో, వాళ్లతో ఎలా ప్రవర్తిస్తాడో ఆవిష్కరిస్తూ సన్నివేశాల్ని తీర్చిదిద్దిన వైనం ప్రేక్షకుల్ని నవ్విస్తుంది. ద్వితీయార్ధంలో కొన్నిసన్నివేశాలు భావోద్వేగాల్ని పండిస్తాయి.కథానాయకుడి సైకిక్ చేష్టలతో ఈ సినిమా మొదలవుతుంది. ఆ తర్వాత పాత్రలు ఒకొక్కటిగా పరిచయం అవుతూ సన్నివేశాలు పరుగులు పెడతాయి. త్రిష, మన్సూర్ పాత్రల పరిచయం, సిద్ధార్థ కలలు, ఆ తర్వాత నమ్మినవాళ్ల చేతిలోనే మోసపోవడం, రోడ్డున పడటం... ఇలా కథంతా ఊహకు తగ్గట్టే సాగినా, సన్నివేశాలు మాత్రం నవ్వుల్ని పంచుతాయి. ఓ వీడియో గేమ్‌లా, ఓ కామిక్ బుక్‌ని తలపించేలా సన్నివేశాలు సాగుతుంటాయి. అవన్నీ నవతరం ప్రేక్షకుల్ని అలరించేవే. కథనాన్ని నడిపించిన విధానమే ఈ సినిమాకు ప్రత్యేకం. ఫన్ వరకూ ఢోకా లేదు. కథ పరిధి పరిమితం కావడంతో ప్రేక్షకుడికి ఎక్కడా ఓ పరిపూర్ణమైన సినిమా చూసిన అనుభూతి కలగదు. యువతరానికి మాత్రమే నచ్చే సన్నివేశాలు ఎక్కువ. మొత్తం నవతరం ప్రేక్షకులను నచ్చేలా డిజైన్ చేసిన ఓ సెటైరికల్ మూవీ ఇది.

**ఎవరెలా చేశారంటే..**

కథానాయకుడు నందు... సిద్ధార్థ్ పాత్రలో ఒదిగిపోయాడు. విచిత్రమైన పాత్ర ప్రవర్తనని ఆయన అర్థం చేసుకున్న విధానం, ఆ సన్నివేశాల్లో ఆయన నటించిన తీరు చాలా బాగుంది. ఒక పాత్ర ప్రధానంగా సాగే సినిమాకి ఇలాంటి నటన చాలా అవసరం. తెలంగాణ యాసలో సంభాషణలు ఈ సినిమాకి బాగా కలిసొచ్చాయి. కథానాయకుడి స్నేహితుడు రేవంత్‌గా కనిపించిన నరసింహా నటన ఈ సినిమాకి మరో బలం. ఓ వివాహితగా యామినీ భాస్కర్ బాగా నటించింది. కథానాయకుడికీ, ఆమెకీ మధ్య సన్నివేశాలు బాగుంటాయి. త్రిష, మన్సూర్ పాత్రలకు తగ్గట్టుగా సుఖేష్‌రెడ్డి, ప్రియాంక నటన ఫర్వాలేదనిపిస్తుంది. సాంకేతికంగా ఈ సినిమా ఉన్నతంగా ఉంది. స్మరణ్ సాయి సంగీతం, ప్రతీక్ నూతి ఎడిటింగ్, ప్రకాశ్‌రెడ్డి విజువల్స్ ఆకట్టుకుంటాయి. లొకేషన్స్ కొత్తగా అనిపిస్తాయి. నిర్మాణం సినిమా స్థాయికి తగ్గట్టుగా ఉంది. దర్శకుడు వరుణ్‌రెడ్డి కథనం విషయంలో పూర్తి పట్టు ప్రదర్శించారు. నవతరం ప్రేక్షకుల్ని మెప్పించేలా ఆయన సన్నివేశాల్ని మలిచిన తీరు చాలా బాగుంది. సంభాషణలు కూడా ఆకట్టుకుంటాయి.

బలాలు

+ నందు నటన

+ కథనం

+ హాస్యం

బలహీనతలు

కథ

కొన్ని బోల్డ్ సన్నివేశాలు

చివరిగా: నవ్విస్తూ నవతరాన్ని ఆకట్టుకునే సైక్ సిద్ధార్థ...

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!



# న్యూఇయర్‌లో కోహ్లీ తొలి పోస్ట్..
## 4 గంటల్లో 60లక్షల లైక్‌లు



ప్రపంచవ్యాప్తంగా 2026 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ రంగాల ప్రముఖులు సైతం న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, అతని సతీమణి అనుష్క శర్మ (Anushka Sharma).. కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని అనుష్కతో కలిసి దిగిన ఫొటోను కోహ్లీ (Virat Kohli) సోషల్ మీడియాలో పంచుకున్నాడు. దీనికి సెలబ్రేషన్స్ ఎమోజీని జత చేశాడు. ఈ ఏడాది విరాట్ సోషల్ మీడియాలో చేసిన తొలి పోస్ట్ ఇదే. ఈ ఫొటోకు కేవలం 4 గంటల్లోనే 60 లక్షలకు పైగా లైక్స్ వచ్చాయి. కోహ్లీ న్యూ ఇయర్‌కు కొన్ని గంటల ముందు 'నా జీవితాన్ని కాంతులతో నింపే అత్యంత ముఖ్యమైన, విలువైన వ్యక్తితో కలిసి 2026లోకి అడుగుపెడుతున్నాను' అంటూ అనుష్కతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశాడు. ఈ పోస్ట్‌కి గంటలోపే దాదాపు నాలుగు మిలియన్ల లైక్‌లు వచ్చాయి

# 2026లో రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉన్న ఐదుగురు భారత క్రికెటర్లు



**2026లో టీమిండియాలోకి చాలామంది యువకులు వచ్చే అవకాశం ఉంది. వయసు మీద పడటం, అవకాశాలు రాకపోవడం వంటి కారణాల చేత పలువురు వెటరన్ స్టార్లు ఆటకు వీడ్కోలు పలికే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. వీరి స్థానాలు భర్తీ చేసే క్రమంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు వస్తాయి. ఈ నేపథ్యంలో రిటైర్మెంట్‌కు దగ్గర పడిన ఐదుగురు టీమిండియా వెటరన్ స్టార్లపై ఓ లుక్కేద్దాం.**

ఈ ప్రస్తావన రాగానే ముందుగా గుర్తొచ్చే పేరు మహ్మద్ షమీ. కారణం ఏదైనా షమీకి ఇటీవలికాలంలో అవకాశాలు రావడం లేదు. అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించి, దేశవాళీ టోర్నీల్లో రాణిస్తున్నా సెలెక్టర్లు చిన్నచూపు చూస్తున్నారు. ప్రస్తుతం షమీ వయసు 35 ఏళ్లు. ఏ రకంగా చూసినా షమీ ఎన్నో రోజుల ఆటలో కొనసాగే అవకాశం లేదు. అవకాశాలు వచ్చినా ఎక్కువ రోజులు కొనసాగే పరిస్థితి లేదు. సాధారణంగానే ఫాస్ట్ బౌలర్లకు కెరీర్ స్పాన్ తక్కువ. 35 ఏళ్ల వచ్చాయంటే రిటైర్మెంట్ స్టేజీలో ఉన్నట్లే. ఈ లెక్కన షమీ ఈ ఏడాది రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉంది.

ఈ ఏడాది రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉన్న రెండో వెటరన్ స్టార్ అజింక్య రహానే. రహానే అధికారికంగా ఆటకు వీడ్కోలు పలకకపోయినా, వయసు మీద పడటం చేత ఇప్పటికే అన్ అఫీషియల్ రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రస్తుతం రహానే వయసు 37 ఏళ్లు. అతను మొదటి నుంచి టెస్ట్ ఫార్మాట్ ప్లేయర్‌గానే మిగిలిపోయాడు. ప్రస్తుత భారత టెస్ట్ జట్టు పరిస్థితి చూస్తే రహానేకు అవకాశం దక్కడం అసంభవం. రహానే ఆడే మిడిలార్డర్‌లో బెర్త్‌ల కోసం పదుల సంఖ్యలో పోటీ ఉంది. ఈ లెక్కన ఈ ఏడాది ముందుగా రిటైర్మెంట్ ప్రకటించే టీమిండియా వెటరన్ రహానే కావచ్చు.

ఈ ఏడాది రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉన్న మరో భారత వెటరన్ స్టార్ యుజ్వేంద్ర చహల్. చహల్ 2023 వన్డే వరల్డ్‌కప్ తర్వాత దాదాపుగా కనుమరుగైపోయాడు. యువ స్పిన్నర్లు బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ రాణిస్తుండటం చహల్‌కు మైనస్ అయిపోయింది. చహల్ బౌలింగ్‌లో అద్భుతాలు చేయగలిగినా బ్యాటింగ్‌లో మాత్రం తేలిపోతాడు.

ఇదే అతని కెరీర్‌ను ఎండ్ కార్డ్ పడేలా చేస్తుంది. మరోవైపు వయసు పైబడటం, యువకులతో పోటీ కూడా చహల్‌కు మైనస్ అవుతున్నాయి. ప్రస్తుతం అతని వయసు 35. వయసును పక్కన పెట్టినా వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి లాంటి అడ్డంకులను దాటుకొని రావాల్సి ఉంటుంది. ఇది అంత ఈజీ కాదు. కాబట్టి ఈ ఏడాదే చహల్ కెరీర్‌కు కూడా ఎండ్ కార్డ్ పడవచ్చు.

ఈ ఏడాది రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉన్న నాలుగో క్రికెటర్ రవీంద్ర జడేజా. జడేజా ఇప్పటికే టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి వన్డే, టెస్ట్‌ల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. ప్రస్తుతానికి జట్టులో అతని స్థానానికి ఢోకా లేనప్పటికీ.. వయసు పైబడటం దృష్ట్యా అతనే స్వచ్ఛందంగా ఆటకు వీడ్కోలు పలకవచ్చు. ఇప్పటికే అతని వారసుడిగా అక్షర్ పటేల్ ప్రమోట్ అయ్యాడు. జడ్డూ ఈ ఏడాది టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించకపోయినా వన్డేల నుంచైనా తప్పుకునే అవకాశం ఉంది.

ఈ ఏడాది షాకింగ్ రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించే అవకాశం ఉన్న భారత స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ కావచ్చు. స్కై ఇటీవలికాలంలో దారుణంగా విఫలమవుతున్నాడు. కెప్టెన్‌గా అద్భుతాలు చేస్తున్నా, వ్యక్తిగతంగా విఫలమవుతుండటంతో ఇప్పటికే అతని ఉనికి ప్రమాదంలో పడింది. స్కై గత 19 ఇన్నింగ్స్‌లో 13.62 సగటున కేవలం 218 పరుగులు మాత్రమే చేశాడు. విపరీతమైన పోటీ ఉన్న భారత టీ20 జట్టులో స్కై ఎక్కువ రోజులు కొనసాగడం అసాధ్యంగా కనిపిస్తుంది. ఫిబ్రవరిలో జరిగే ప్రపంచకప్ తర్వాత స్కై రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉంది.

# టీమిండియా స్టార్ల 'రీఎంట్రీ' ఫిక్స్!.. ఎవరెవరు ఎప్పుడంటే..

**టీమిండియా టెస్టు, వన్డే సారథి శుబ్‌మన్ గిల్ తిరిగి మైదానంలో అడుగుపెట్టనున్నాడు. దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ 2025-26 సీజన్‌లో ఆడేందుకు అతడు సిద్ధమయ్యాడు. పంజాబ్ తరఫున ఓపెనర్‌గా గిల్ బరిలోకి దిగనున్నాడు. జైపూర్ వేదికగా సిక్కిం, గోవా జట్లతో పంజాబ్ శని (జనవరి 3), మంగళవారాల్లో (జనవరి 6) ఆడే మ్యాచ్‌లో గిల్ భాగం కానున్నట్లు క్రిక్‌బజ్ వెల్లడించింది. కాగా సౌతాఫ్రికా (IND vs SA) తో ఇటీవల జరిగిన ఆల్ ఫార్మాట్ సిరీస్‌లో గిల్‌కు చేదు అనుభవాలు ఎదురయ్యాయి.**

**––అనూహ్య రీతిలో వేటు**

తొలి టెస్టు సందర్భంగా గాయపడిన గిల్ .. సఫారీలతో రెండో టెస్టుతో పాటు వన్డే సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఆ తర్వాత టీ20 సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చి వరుస వైఫల్యాలతో విమర్శలు మూటగట్టుకున్నాడు. దీంతో నాలుగు, ఐదో టీ20ల నుంచి యాజమాన్యం అతడిని తప్పించింది. అంతేకాదు.. అనూహ్య రీతిలో ప్రపంచకప్2026 జట్టులోనూ గిల్‌కు చోటివ్వలేదు. వైస్ కెప్టెన్‌గా ఉన్న ఈ కుడిచేతి వాటం బ్యాటర్‌పై వేటు వేసి.. టీ20ల నుంచి పక్కనపెట్టేసింది. ఈ నేపథ్యంలో విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో గిల్ సత్తా చాటి తిరిగి ఫామ్‌లోకి రావాలని గిల్ భావిస్తున్నాడు.

--ఇప్పటికే ఆడేశారు

ఇదిలా ఉంటే.. భారత బ్యాటింగ్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇప్పటికే ఢిల్లీ, ముంబై తరఫున ఈ టోర్నీలో రెండేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నారు.

టీమిండియా స్టార్లు రిషభ్ పంత్ ఢిల్లీ సారథిగా, నితీశ్ కుమార్ రెడ్డి ఆంధ్ర జట్టు కెప్టెన్‌గా ఉండగా.. రుతురాజ్ గైక్వాడ్ మహారాష్ట్ర, సర్ఫరాజ్ ఖాన్ ముంబై, దేవదత్ పడిక్కల్ కర్ణాటక తరఫున దుమ్ములేపుతున్నారు. ఇక అభిషేక్ శర్మ సైతం పంజాబ్ తరఫున బరిలోకి దిగాడు.

**––టీమిండియా స్టార్ల 'రీఎంట్రీ'!.. ఎవరెవరు ఎప్పుడంటే..**

ఈ జాబితాలో ఇప్పుడు గిల్‌తో పాటు వెటరన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా చేరనున్నాడు. సర్వీసెస్, గుజరాత్ జట్లతో జనవరి 6,8వ తేదీల్లో జరిగే మ్యాచ్‌లలో సౌరాష్ట్రకు జడ్డూ ప్రాతినిథ్యం వహించనున్నాడు. మరోవైపు.. భారత వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ సైతం కర్ణాటక తరఫున విజయ్ హజారే ట్రోఫీ ఆడేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు.

త్రిపుర, రాజస్తాన్‌లతో జనవరి 3, 6 తేదీల్లో జరిగే మ్యాచ్‌లలో కర్ణాటక తరఫున కేఎల్ రాహుల్ ఆడనున్నాడు. ఇక గిల్‌తో పాటు.. జడేజా, కేఎల్ రాహుల్ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు పూర్తి చేసుకుని.. కోహ్లీ, రోహిత్‌లతో కలిసి స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్ బరిలో దిగనున్నారు. సొంతగడ్డపై కివీస్‌తో టీమిండియా మూడు వన్డే, ఐదు టీ20లు ఆడనుంది.



# 8 నిమిషాల్లో అమ్ముడుపోయిన
## భారత్‌న్యూజిలాండ్ తొలి వన్డే టికెట్లు

భారత్, న్యూజిలాండ్ మధ్య జనవరి 11న వడోదరలోని కొటంబి స్టేడియంలో జరగాల్సిన తొలి వన్డే మ్యాచ్ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆన్‌లైన్‌లో అమ్మకం ప్రారంభించిన 8 నిమిషాల్లోనే టికెట్లన్నీ సోల్డ్ ఔటయ్యాయి. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూడాలనుకున్న వారిని ఈ విషయం బాధిస్తున్నప్పటికీ.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి అభిమానులకు మాత్రం సంతృప్తినిస్తుంది. తమ ఆరాధ్య ఆటగాళ్లకు ఉన్న క్రేజ్ వల్లే, ఇలా తక్కువ సమయంలో టికెట్లు అమ్ముడుపోయాయని వారు సంబరపడిపోతున్నారు. ఇది కదా రో-కో క్రేజ్ అంటే అంటూ సోషల్‌మీడియాలో బజ్ క్రియేట్ చేస్తున్నారు. రాజ్‌కోట్, ఇండోర్‌లో జరిగే మిగతా రెండు వన్డేల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంటుందంటూ హడావుడి చేస్తున్నారు. కాగా, రోహిత్-విరాట్ టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో రో-కో ఆకాశమే హద్దుగా చెలరేగడంతో న్యూజిలాండ్ సిరీస్ తొలి వన్డేకు హైప్ మరింత పెరిగింది. కోహ్లి ఆటను ప్రత్యక్షంగా చూడటమే లక్ష్యంగా అభిమానులు టికెట్ల కోసం ఎగబడ్డారు. సౌతాఫ్రికా సిరీస్‌లో విరాట్ వరుసగా రెండు సెంచరీలు, ఓ హాఫ్ సెంచరీ చేసి ఫ్యాన్స్‌కు పిచ్చెక్కించాడు. ఇదే ఫామ్‌ను విరాట్ వడోదర వన్డేలోనూ కొనసాగిస్తాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్, 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ల కోసం న్యూజిలాండ్ జట్టు భారత్‌లో పర్యటిస్తుంది. ఈ సిరీస్‌లలో తొలుత వన్డేలు జరుగనున్నాయి. జనవరి 11, 14, 18 తేదీల్లో వడోదర, రాజ్‌కోట్, ఇండోర్ వేదికలుగా మూడు వన్డేలు జరుగుతాయి. అనంతరం 21, 23, 25, 28, 31 తేదీల్లో నాగ్‌పూర్, రాయ్‌పూర్, గౌహతి, విశాఖపట్నం, తిరువనంతపురం వేదికలుగా టీ20లు జరుగనున్నాయి. టీ20 సిరీస్ కోసం భారత జట్టును ఇదివరకే ప్రకటించగా.. వన్డే జట్టును ప్రకటించాల్సి ఉంది.



# అర్జున్ దేశ యువతకు స్ఫూర్తి

**––భారత చెస్ ఆటగాడిపై ప్రధాని మోదీ ప్రశంసలు**

'ఫిడే' వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ బ్లిట్జ్ విభాగంలో కాంస్య పతకం సాధించిన భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు. దోహా వేదికగా జరిగిన ఈ టోర్నీ సెమీఫైనల్లో ఓడిన అర్జున్ కాంస్యం దక్కించుకున్నాడు. అంతకుముందు ర్యాపిడ్ విభాగంలోనూ అర్జున్ కాంస్యం గెలిచాడు. తద్వారా విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఒకే వరల్డ్ చాంపియన్‌షిప్ రెండు విభాగాల్లో పతకాలు సాధించిన తొలి భారత ఆటగాడిగా అర్జున్ నిలిచాడు. సెమీఫైనల్‌కు ముందు 19 రౌండ్‌లలో కలిపి 15 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచిన అర్జున్... వరల్డ్ నంబర్‌వన్ కార్ల్‌సన్ సహా పలువురు ప్రముఖ ఆటగాళ్లపై విజయాలు సాధించాడు. అయితే సెమీస్‌లో మాత్రం ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ అబ్దుసత్తొరోవ్ నొదిర్‌బెక్ చేతిలో ఓడి మూడో స్థానానికి పరిమితమయ్యాడు. 'చదరంగంలో భారత్ జోరు కొనసాగుతోంది. వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ బ్లిట్జ్ విభాగంలో కాంస్యం నెగ్గిన అర్జున్ ఇరిగేశికి అభినందనలు. ఇటీవల ర్యాపిడ్ విభాగంలోనూ కాంస్యం నెగ్గిన అర్జున్... బ్లిట్‌జ్‌లోనూ సత్తా చాటాడు. అతడి విజయం దేశ యువతకు స్ఫూర్తి. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో విజేతలకు 'ఫిడే' బుధవారం పతకాలు అందజేసింది. అర్జున్ రెండు కాంస్య పతకాలు అందుకోగా, మహిళల ర్యాపిడ్‌లో కాంస్యం గెలుచుకున్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపికి కాంస్యం అందించారు. కార్ల్‌సన్ అటు ర్యాపిడ్, ఇటు బ్లిట్జ్ రెండు విభాగాల్లోనూ విజేతలుగా నిలిచాడు. ముగింపు కార్యక్రమంలో 'ఫిడే' అధికారులతో పాటు భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ పాల్గొన్నాడు.

**––'నాకౌట్‌లో నమ్మకం కలిగింది'**

వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లలో రెండు టైటిల్స్ సాధించడం పట్ల నార్వే స్టార్ మాగ్నస్ కార్ల్‌సన్ సంతోషం వ్యక్తం చేశాడు. తనకు సంబంధించి ఆరంభంలో టోర్నీ కఠినంగా సాగినా...చివరకు గెలవగలనని నమ్మానని అతను చెప్పాడు. 'ఈ టోర్నమెంట్ ఆశించినంత సులువుగా సాగలేదు. ఫలితం ప్రతికూలంగా కూడా వచ్చి ఉండేది. అయితే నాకౌట్‌కు వెళ్లిన తర్వాత నాపై నమ్మకం పెరిగింది. ఈ దశలో మరింత ఉత్సాహంగా, బాగా ఆడగలనని అనిపించింది. చివరకు అది బాగా పని చేసింది' అని విజయానంతరం కార్ల్‌సన్ వ్యాఖ్యానించాడు. మరోవైపు రెండు టైటిల్స్ నెగ్గినా కార్ల్‌సన్ క్రీడా స్ఫూర్తిని ఉల్లంఘించాడంటూ వివాదం రేగింది. స్విస్ విభాగం 14వ రౌండ్‌లో హైక్ మార్టిరోస్యాన్ (ఆర్మేనియా)తో అతను తలపడిన సందర్భంలో అనూహ్య ఘటన జరిగింది. వేగంగా ఆడే ప్రయత్నంలో అతని చేతులు తగిలి బోర్డుపై ఉన్న పావులు కొన్ని కింద పడిపోయాయి. అప్పటికి అతని వద్ద రెండు సెకన్ల సమయం మాత్రమే మిగిలి ఉంది. పావులను సరైన స్థానంలో పెట్టే ప్రయత్నంలో అతను టైమింగ్ క్లాక్‌ను నిలిపివేశాడు. ఫలితంగా అతనికి ఆ రెండు సెకన్ల అదనపు సమయం కలిసొచ్చింది. ఇది నిబంధనలకు విరుద్ధం. దాంతో ఆర్బిటర్స్ జోక్యం చేసుకొని మాగ్నస్‌పై చర్య తీసుకున్నారు. మార్టిరోస్యాన్‌ను విజేతగా ప్రకటించారు. దీనికి అంగీకరిస్తూ అతను వైదొలిగాడు.